జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

- ఒంగోలు విరాట్‌నగర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఒంగోలులోని విరాట్‌నగర్ వార్డు సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ఎంపీ మాగుంటతో పాటు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హాజరై పరిశీలించారు. నగరంలోని 9 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) పరిధిలోని క్లాపేట, కొణిజేడు బస్టాండ్ సెంటర్, గుర్రంవారివీధి, గోపాల్‌నగర్–2, ఎన్‌జీఓ కాలనీ, విరాట్‌నగర్ వార్డు సచివాలయాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని కొనియాడారు. ఆయా సచివాలయాల నుంచి సుమారు 1,385 మంది ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, ఎంఈ జానీ, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదల రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష : ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: నిరుపేదల పాలిట జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రక్షణగా నిలుస్తుందని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. అత్యంత ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పేదల ముంగిటకు తీసుకొచ్చి ఉచితంగా వైద్యం చేయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి వారు దీవించాల్సిన అవసరం ఉందన్నారు. మద్దిపాడు మండలంలో 8,254 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులిచ్చినట్లు తెలిపారు. వారిలో సుమారు రెండు వేల మందికిపైగా కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ముందుగా జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే టీజేఆర్ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, నాయకులు మోరబోయిన సంజీవరావు, గుర్రపాతల రవి, తేళ్ల పుల్లారావు, లింగా రామకృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నర్రా సురేష్, లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామ నాయకులు సంజీవరెడ్డి, ఎంపీటీసీ పల్లకి పద్మ కుమారి, గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, సన్నపురెడ్డి రమణమ్మ, పీహెచ్‌సీ వైద్యులు ఆనందమోహన్ జగదీష్, శ్రావణ్, వినీల, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఒంగోలు సమతానగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, తదితరులు

మెడికల్ క్యాంప్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ...

గుండ్లాపల్లిలో మెడికల్ క్యాంప్‌ను డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

చింతాయగారిపాలెంలో పరిశీలించిన ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి...

ఒంగోలు రూరల్: మండలంలోని చింతాయగారిపాలెంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి యాదాల అశోక్‌బాబు పరిశీలించారు. సర్పంచ్ నాయుడుశ్రీరాములు, కార్యదర్శి జి.స్వప్న, కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఉదయం 9 గంటలకు వైద్య శిబిరాన్ని ప్రారంభించగా ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. మధ్యాహ్నం జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు మెడికల్ క్యాంప్‌ను సందర్శించారు. సుమారు 470 మందికి పైగా పెద్దదేవరంపాడు, చింతాయగారిపాలెం గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని మందులు అందుకున్నారు. కరవది పీహెచ్‌సీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి, అమ్మనబ్రోలు మెడికల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రావణ్, మనోజ్ఞ, వైద్య నిపుణులు పాల్గొని సేవలందించారు.



గుండ్లాపల్లిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నాయకులు, అధికారులు



చింతాయగారిపాలెంలో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి యాదాల అశోక్‌బాబు

ఉపాధ్యాయుల దాతృత్వం అభినందనీయం

చీమకుర్తి: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తరఫున ఉపాధ్యాయులు అందిస్తున్న దాతృత్వం అభినందనీయమని చీమకుర్తి ఎంఈఓ–1, 2 ఎస్.వెంకటేశ్వరరెడ్డి, కే శివాజీ ప్రశంసించారు. శనివారం చీమకుర్తి ఎన్ఎస్‌పీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ సంఘం తరఫున నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఆరుగురు సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్లకు ఎంఈఓల చేతుల మీదుగా ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, 16 రకాల నిత్యావసర వస్తువులతో పాటు రూ.20,500 నగదు అందించారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘంలోని సభ్యులు అందించిన విరాళాల ద్వారా అందించిన రూ.50 వేల నగదుతో ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి సహకారం అందించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బందికి దసరా పండుగ సందర్భంగా ఏపీటీఎఫ్ చేసిన సేవలను ఎంఈఓలు, టీచర్లు కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.



సీఆర్‌పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి నగదు, బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న ఎంఈఓలు, టీచర్లు

అముక్తకు బాలినేని అభినందనలు

ఒంగోలు సెంట్రల్: జాతీయ స్థాయిలో అండర్–11 బాలికల విభాగంలో వైజాగ్‌లో నిర్వహించిన చెస్ పోటీల్లో పదో స్థానంలో నిలిచిన అముక్తను చెస్‌లో ఆమెను మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని శనివారం అభినందించారు. అదేవిధంగా వైజాగ్‌లో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా అముక్తను అభినందించి రూ.5 వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు



అముక్తను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు క్రీడాకారులు రాణించాలి

- ప్రకాశం క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో ఎంపీ మాగుంట

ఒంగోలు: ఒంగోలు నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ క్రీడాకారులు రాణించాలనే ఆశయంతోనే ప్రకాశం క్రికెట్ లీగ్ బై మాగుంట అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మాగుంట యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 ఓవర్ల హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఆలోచనతోనే ఈ పోటీలు నిర్వహణ ప్రారంభమైందన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో 30 టీములు తలపడుతున్న దృష్ట్యా క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలన్నీ జాగ్రత్తగా చూసుకోవాలని యూత్ ఫోర్స్ సభ్యులకు సూచించారు. ఇప్పటికే మాగుంట యూత్ ఫోర్స్ సభ్యుడు వెంకటాద్రిరెడ్డి క్రికెట్ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషిచేస్తున్నారని, బాలికలు కూడా ఆడేందుకు ముందుకు వస్తున్న తరుణంలో మాగుంట యూత్‌ఫోర్స్ నిర్వహిస్తున్న పోటీలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోటీల్లో పాల్గొనే జట్లకు ప్రకాశం క్రికెట్ లీగ్ పేరుతో ముద్రించిన టీ షర్టులు అందించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి టాస్ వేసి నారాయణ – కేసీసీ జట్ల మధ్య మ్యాచ్‌ని ప్రారంభించారు. నగర మేయర్ గంగాడ సుజాత బౌలింగ్ చేయగా మాగుంట బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అయినాబత్తిన ఘనశ్యాం, ఓగిరాల రామకృష్ణ, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి, రావూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు. తొలి మ్యాచ్‌లో నారాయణ లెవన్స్ నిర్ణీత పది ఓవర్లలో 91 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేసీసీ జట్టు 35 పరుగులకే ఆలౌటైంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

గ్రంథాలయాలతో విజ్ఞానం

కొత్తపట్నం: గ్రంథాలయాలతో విజ్ఞానం అందుతుందని గ్రంథపాలకుడు సీహెచ్ అజయ్‌బాబు అన్నారు. దసరా సెలవుల సందర్భంగా ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించగా, శనివారం ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ నీతి కథలు, హాస్య కథలు చదివించడం, చెప్పించడం, వివిధ రకాల పుస్తకాలు చదివించడం, ఆటలు ఆడించడం వంటివి చేయించామన్నారు. పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్ పి.శ్రీను చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పురిణి శ్రీరాములరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అజయ్‌బాబు

పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

కొత్తపట్నం: పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని మెరైన్ సీఐ కె.శ్రీనివాసరావు కొనియాడారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్తపట్నం కె.పల్లెపాలెం బీచ్‌లో ర్యాలీ నిర్వహించారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, సివిల్ పోలీస్‌లు కె.పల్లెపాలెం బంగారమ్మ గుడి వద్ద నుంచి బీచ్ ప్రాంతానికి ర్యాలీగా వెళ్లారు. తీరంలో ఎస్సై ఫణిభూషణ్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన పోలీస్ వాచ్ టవర్ దగ్గరకు చేరుకుని మానవహారం నిర్వహించారు. పోలీస్ అమరవీరులు ఆత్మ శాంతించాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్సై వెంకటేశ్వర్లు, మెరైన్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది

మెట్ట తామరతో మురుగునీటి నిల్వకు చెక్

చీమకుర్తి: మురుగునీటి నిల్వల్లో మెట్ట తామర మొక్కలు నాటడం ద్వారా నిల్వలను తగ్గించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని కూనంనేనివారిపాలెం పంచాయతీని శనివారం ఆయన సందర్శించారు. మురుగునీటి నిల్వలు లేకుండా మెట్టతామర మొక్కలు నాటడాన్ని పరిశీలించారు. కార్యదర్శి శ్యామ్ కుమార్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



మెట్ట తామర మొక్కల నాట్లను పర్యవేక్షిస్తున్న నారాయణరెడ్డి

రోశయ్య విగ్రహ ఏర్పాటు అంశం ప్రభుత్వం దృష్టికి

ఒంగోలు అర్బన్: స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వెలుపల మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహ ఏర్పాటు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో విగ్రహ కమిటీ సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ వెలుపల రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయడం సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధమంటూ ఆర్‌అండ్‌బీ, పోలీసు శాఖలు గతంలో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పునఃసమీక్షించాలని రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. హెవీ ట్రాఫిక్ ఐల్యాండ్స్, పార్కులు వంటి ప్రదేశాల్లోనే విగ్రహాలు ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు సూచించినట్లు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ దేవానందం, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



విగ్రహ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గంధోత్సవంలో పాల్గొన్న మారం



ప్రార్థనలు చేస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి శుక్రవారం రాత్రి చంద్రపాడు గ్రామంలో జరిగిన హజరత్ గంధోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రార్థనలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఒంగోలు సెంట్రల్: మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్‌వలి అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 72 ఉర్దూ లైబ్రరీలు, కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయని చెప్పారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రాలకు రూ.10.98 లక్షల బిల్లులు జమ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బోర్డు డైరెక్టర్ బాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా కెమికల్స్ దుకాణాల ఆకస్మిక తనిఖీ

ఒంగోలు సెంట్రల్: ఆక్వా ఫీడ్, కెమికల్స్ దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని నడుపుకోవాలని జిల్లా ఫిషరీష్ జాయింట్ డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని పలు దుకాణాలను శనివారం ఏడీ ఉషాకిరణ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సత్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్నూలు రోడ్డులో ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్ అథారిటీ (ఎస్‌ఏడీఏ) అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పలు దుకాణాలను గుర్తించి వారు విక్రయిస్తున్న ఉత్పత్తులు, అనుమతి పత్రాలను పరిశీలించారు. అనుమతి పత్రాలు లేని దుకాణదారులకు జరిమానా విధించారు.

పన్నుల వసూళ్లలో వెనకబడితే సహించేది లేదు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఇంటి పన్ను, కుళాయి పన్ను, క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లలో వెనకబడితే సహించేది లేదని వార్డు సచివాలయ సిబ్బందిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక కమిషనర్ చాంబర్ నుంచి నగరంలోని 70 వార్డు సచివాలయాల సిబ్బందితో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. పన్నుల వసూళ్లలో నెలవారీ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. లేకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. పలు సలహాలు, సూచనలు చేశారు.